క్లుప్తంగా

సేఫ్టీ కోర్సుల సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకరరెడ్డి

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లోని సేఫ్టీ కోర్సుల్లో చేరి కోర్సు పూర్తి చేసిన వారికి ఆదివారం సర్టిఫికెట్లను అందించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకరరెడ్డి పాల్గొని ఫైర్ సేఫ్టీ, కెమికల్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేఫ్టీ కోర్సులు పూర్తి చేసిన వారికి విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, గైస్‌లో నిర్వహిస్తున్న కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కెమికల్ హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, సేఫ్టీ కోర్సుల కరిక్యులమ్ కో ఆర్డినేటర్ ఎ.వరహాలు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టం అమలుతో బాలలకు భరోసా



మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట: విద్యా హక్కు చట్టం ప్రకారం ఆరు నుంచి 14 ఏళ్ల బాలలకు ప్రభుత్వం ఉచిత విద్య అందించాల్సి ఉందని ఏపీ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. విద్యా హక్కు చట్టం ప్రవేశపెట్టి 15 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడం ద్వారా బాలలకు భరోసా ఇవ్వాలన్నారు. చట్టం అమలు తీరుపై శ్వేతపత్రం విడుదల చేయాలని, రాష్ట్రంలో సున్నా నుంచి 18 ఏళ్ల వయసు గల బాలలందరినీ చట్ట పరిధిలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో వక్తలు పి.కె.జోషి, రమాదేవి, గౌరీశంకర్, మణి, హరగోపాల్, హుస్సేన్, చాట్ల బాబూరావు, రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని మోదీని ఓడిద్దాం



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట: హామీలు అమలు చేయని అబద్ధాల ప్రధాని నరేంద్రమోదీని రానున్న ఎన్నికల్లో ఓడించి ఆటో, మోటార్ రంగాన్ని కాపాడాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు కేలం శివ పిలుపునిచ్చారు. అక్కయ్యపాలెం హైవే కూడలి వద్ద ఆదివారం జరిగిన ఆటో డ్రైవర్ల ధర్నాలో వారు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలికితీసి ప్రతి పేద కుటుంబానికి రూ.15 లక్షలు బ్యాంకులో వేస్తామని హామీ ఇచ్చి పదేళ్లు గడిచినా.. ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో శంకర్, సూకరాజు, జి.నందీశ్వరరావు, శివ, బాలు, చింతపల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

కత్తులతో యువకుల హల్‌చల్

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కప్పరాడ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆదివారం పాత తగాదాల కారణంగా రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దివ్యతేజ, మహేష్, మదన్ అనే ముగ్గురు యువకులపై గణేష్ వర్గం యువకులు కత్తులతో దాడికి పాల్పడినట్టు తెలిసింది. గణేష్‌తోపాటు ఇద్దరు మేనల్లుళ్లు కలిసి దివ్యతేజ, మహేష్, మదన్‌పై కత్తులతో దాడి చేశారని బాధితుడు సమాచారం అందించినట్లు తెలిసింది. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రజలే వైఎస్సార్‌సీపీ బలం

- సీఎంగా జగన్‌ను మళ్లీ గెలిపించుకుందాం
- 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశాలు



50వ వార్డు ఆత్మీయ సమావేశంలో జనసేన నాయకుడు పేడాడ సత్యంను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కె.కె.రాజు



53వ వార్డు ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

మద్రిపాలెం: వైఎస్సార్‌సీపీకి ప్రజలే బలమని, ఎన్నికల ప్రచారంలో వారి నుంచి విశేష ఆదరణ లభిస్తోందని పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రజలను సమన్వయ పరుస్తూ వార్డు నాయకులు కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండేలా సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. పార్టీపై ప్రజలకు మంచి అభిప్రాయం ఉందని, సీఎంగా మళ్లీ జగనన్నను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీకేపీసీఐఆర్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, జేసీఎస్ నాయకులు బగాది విజయ్, పైడి కృష్ణారావు మాస్టారు, అమర్‌రెడ్డి, పి.సునీత, ఎం.లక్ష్మి, పార్టీ సీనియర్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి జనసేన నాయకుడు

జనసేన పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన పేడాడ సత్యం వైఎస్సార్‌సీపీలో చేరారు. 50వ వార్డు కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సమక్షంలో పార్టీలో చేరిన ఆయనకు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ సిద్ధాంతాలు, కె.కె.రాజు పనితీరు నచ్చి పార్టీలో చేరినట్టు పేడాడ సత్యం తెలిపారు. పార్టీ గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు.

49వ వార్డులో..

జీవీఎంసీ 49వ వార్డులో సూరిశెట్టి లక్ష్మణ్, జనపురెడ్డి వెంకటరావు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావుతో కలిసి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్.రవికుమార్, ఐ.రవికుమార్, సిరికి వెంకటరావు, ఆదిరెడ్డి శ్రీను, సింహాచలం, సతీష్, రాము, చంద్రమౌళి, శ్రీను, చంద్రశేఖర్, శంకర్, శివప్రసాద్, సీహెచ్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి శ్రమించాలి

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ శ్రమించాలని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. 53వ వార్డు పంజాబ్ హోటల్ జంక్షన్ వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ బర్కత్ అలీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రజలకు నిస్వార్థ సేవలు అందించారన్నారు. పార్టీ సిద్ధాంతాలను పార్టీ శ్రేణులంతా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వీకేపీసీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, జేసీఎస్ ప్రెసిడెంట్, కన్వీనర్ పైడి కృష్ణారావు మాస్టర్, అమర్‌రెడ్డి, జిల్లా యువజన విభాగం ప్రెసిడెంట్ ఆళ్ల శివగణేష్, వార్డు సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు కుటిల రాజకీయాలను తిప్పికొడదాం



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

మద్రిపాలెం: టీడీపీ అధినేత చంద్రబాబు కుటిల రాజకీయాలు చేస్తున్నారని, వాటిని త్వరలోనే తిప్పికొడదామని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. 50వ వార్డు మురళీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశం అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకులు పేదలను లక్ష్యంగా చేసుకుంటూ రాజకీయ క్రీడను ప్రదర్శిస్తున్నారన్నారు. లబ్ధిదారులకు పెన్షన్ నేరుగా ఎందుకు అందజేస్తున్నారో కనీస అవగాహన, జ్ఞానం లేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రతి నెలా కోడి కూయక ముందే సూర్యోదయంతో పోటీపడుతూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు నేరుగా వారి గడపకే పింఛన్ అందించే వారిని ఇబ్బందికి గురిచేసేలా ఇటువంటి కుట్ర రాజకీయాలు చేయడం దురదృష్టకరమన్నారు. వృద్ధులు, దివ్యాంగులు బ్యాంకులకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి గడపకే పెన్షన్ అందేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. కరోనా మహమ్మారి దేశాన్ని అతలాకుతలం చేసిన సమయంలో కూడా వలంటీర్ వ్యవస్థ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. కూటమి రాజకీయాలు హుందాగా చేయాలని హితవు పలికారు. ప్రస్తుత పరిస్థితి చూసి వలంటీర్లు అధైర్య పడవద్దని, వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని కె.కె.రాజు పిలుపునిచ్చారు. జూన్‌లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి లబ్ధిదారులకు ఇళ్ల వద్దే పెన్షన్లు పంపిణీ చేస్తారన్నారు.

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కె.కె.రాజు

మద్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేసి కట్టుబడి ఉన్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 49వ వార్డు మురళీనగర్ ఎన్జీవోస్ కాలనీ మసీద్ సమీపంలో ఆదివారం సాయంత్రం స్థానిక ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. మత పెద్దలు ముస్లిం సంప్రదాయ పద్ధతిలో కె.కె.రాజును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ కలిసి ఉంటేనే సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు. ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ముస్లింలకు ప్రాధాన్యం కల్పించేలా శాసనసభ, శాసన మండలి సభ్యత్వంలో సైతం ముస్లింలకు సీఎం జగన్ స్థానం కల్పించారన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సహకరించాలని కోరారు. రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు, గాజువాక నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ఐహెచ్ ఫరూఖీ పర్యవేక్షించిన ఈ కార్యక్రమంలో వీకేపీసీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, 49, 53 వార్డుల కార్పొరేటర్లు అల్లు శంకరరావు, బర్కత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

'వలంటీర్లు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి'

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ పరిధిలోని వార్డు వలంటీర్లు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించి రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొనరాదని ఉత్తర ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.అఖిల తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందించే పింఛన్లు సహా నగదు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనకూడదని స్పష్టం చేశారు. విరుద్ధంగా ఏ వలంటీర్ ప్రవర్తించినా.. ప్రభుత్వ ఉద్యోగులు నిబంధనలు మీరి రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్నా.. అటువంటి వారిపై తగు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు.

ఓటర్లకు చేరువగా విస్తృత సేవలు

- మన పోలింగ్ బూత్ – మన ఓటు కార్యక్రమంలో కలెక్టర్ మల్లికార్జున



నక్కవానిపాలెం స్కూల్‌లో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సీతమ్మధార: ఓటర్లకు చేరువగా విస్తృత సేవలు అందిస్తున్నామని, దానిలో భాగంగానే మన పోలింగ్ బూత్ – మన ఓటు చైతన్య కార్యక్రమం చేపట్టామని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు అన్ని దశల్లో ఓటర్లకు అన్ని రకాల సేవలు అందిస్తున్నామన్నారు. 24వ వార్డు నక్కవానిపాలెం జీవీఎంసీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం ఉత్తర నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లతో కలిసి ఆయన సందర్శించారు. 161, 163, 164, 165, 166 పోలింగ్ బూత్‌లను పరిశీలించి అధికారులకు, బీఎల్వోలకు సూచనలిచ్చారు. కేంద్రాల వద్దకు వచ్చిన ఓటర్లతో మాట్లాడి వారి ఓట్లు సరి చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ బీఎల్వోలు ప్రజలకు మరింత చేరువగా ఉంటూ ఉత్తమ సేవలు అందించాలన్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన మన పోలింగ్ బూత్ – మన ఓటు చైతన్య కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని చెప్పారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కోరాడ రామలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, శంకర్, బీఎల్వోలు టి.సతీష్, స్వామి, యుగంధర్, లక్ష్మి, త్రిపుర, భారతి, వీఆర్వో పొన్నాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వండర్ కిడ్స్ ప్రతిభ



ఎక్స్‌పోలో ప్రశ్నలకు సమాధానాలిస్తున్న చిన్నారులు

సీతంపేట: అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ఎక్స్‌పో–2024 ఆలోచింపజేసింది. స్కూల్ డైరెక్టర్ ఎం.రామునాయుడు, ప్రిన్సిపాల్ ఎం.వాణిశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎక్స్‌పోలో ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి విద్యార్థులు అసాధారణ ప్రతిభతో అబ్బురపర్చారు. యూకేజీ పిల్లలు ప్రపంచ పటంలోని అన్ని దేశాలు, వాటి రాజధానులను గుర్తించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఎల్‌కేజీ పిల్లలు వెయ్యి ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. భారతదేశం మ్యాప్‌లో అన్ని రాష్ట్రాలు, రాజధానులు, భౌగోళిక స్వరూపాన్ని గుర్తించి ఔరా అనిపించారు. 1, 2, 3 తరగతి పిల్లలు హయ్యర్ గ్రేడ్ టెస్ట్ బుక్స్ నుంచి తెలుగు, ఇంగ్లిష్, హిందీ డిక్టేషన్ రాసి మంత్రముగ్ధులను చేశారు. 4, 5 తరగతి విద్యార్థులు టెస్ట్ బుక్ ఆధారంగా మెరుపు వేగంతో గణిత గణనలను పరిష్కరించి, తల్లిదండ్రులు, వీక్షకులను ఆశ్చర్య చకితులను చేశారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



రైతుకు కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న కె.కె.రాజు



నరసింహనగర్ రైతుబజార్‌లో కొబ్బరికాయలు విక్రయిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతంపేట: గడిచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధిని ప్రజలు ఆదరించాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం నరసింహనగర్ రైతుబజార్‌లో ఆయన పర్యటించారు. రైతులు, వినియోగదారులతో ముచ్చటించారు. రాష్ట్రంలో, ఉత్తర నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, గడప గడపకూ అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వారికి వివరించి, కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో అవినీతికి తావులేకుండా కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ చేరవేశామన్నారు. నరసింహనగర్ రైతుబజార్‌లో సుమారు రూ.20 లక్షలతో మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి భారీ మెజారిటీతో వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వీకేపీసీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, పార్టీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, డైరెక్టర్ సూకరాజు, హరిపట్నాయక్, యువజన విభాగం నాయకులు అంబటి శైలేష్, ఎం.సునీల్, జ్ఞానేష్, బి.గోవింద్, బల్ల శ్రీను, టీవీఆర్ మూర్తి, 14, 45 వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ సూర్యారావు



ద్వారకా స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ రమేష్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్‌ఐ సూర్యారావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యాక్టివ్‌గా ఉన్న రౌడీలను హెచ్చరించారు. నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల పనులపై పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా పీఎస్‌లో..

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ ఎస్.రమేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎక్కడికి వెళ్లిన పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వాలని రౌడీషీటర్లకు సూచించారు. మీరు నివసించే ప్రాంతాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు. ఎస్‌ఐ ధర్మేంద్ర పాల్గొన్నారు.

గ్రామ సంఘాల ఎన్నికలు నిషేధించాలి

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి కప్పరాడ, రాంజీ ఎస్టేట్, పెదకొత్తూరు, అంబేడ్కర్ ఎస్టేట్ కొండవాలు ప్రాంతాల్లో గ్రామ సంఘాల ఎన్నికల నిర్వహిస్తే వివాదాస్పద సంఘటనలు జరుగుతాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో గ్రామ సంఘాలకు పదవీ కాలం ముగియడంతో ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు వారు చెబుతున్నారు. మేలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులో ఉందని తెలిసినా.. గ్రామ సంఘాల ఎన్నికలు జరిపించాలని చూస్తున్నారని, వాటిని నిషేధించాలన్నారు. అలా జరిగితే ఆయా ప్రాంతాల్లో వివాదాస్పద, గొడవలకు దారి తీసే సంఘటనలు, ఆర్థిక లావాదేవీలు వంటివి జరిగే అవకాశముందని, దీనిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్‌వో), పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

6న బెస్ట్ స్మైల్ పోటీలు



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హాస్పిటల్ డైరెక్టర్ రమేష్, కళాకారులు, క్రీడాకారులు

తాటిచెట్లపాలెం: రైల్వేస్టేషన్ రోడ్డులోని రైల్వే క్రికెట్ స్టేడియంలో ఆదివారం వీ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 6న నిర్వహించనున్న బెస్ట్ స్మైల్ పోటీల పోస్టర్‌ను వివిధ రంగాల కళాకారులు, క్రీడాకారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీ డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ పోటీల వివరాలను వెల్లడించారు. దంతాల సంరక్షణపై అన్ని వయసుల వారికి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో 'విజయ దరహాసం' పేరుతో నవ్వుల పోటీలకు శ్రీకారం చుట్టామన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఎవరైనా పాల్గొనవచ్చని చెప్పారు. చక్కగా నవ్వుతూ ఉన్న ఫొటోతో పాటు పేరు, వయసు, ప్రాంతం, ఫోన్ నంబర్‌ను ఈ నెల 3లోగా 91336 94124 నంబర్‌కు వాట్సాప్ చేయాలని కోరారు. ఉత్తమ నవ్వుల చిత్రాలకు ఈ నెల 6న డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బెస్ట్ స్మైల్ అవార్డులను అందజేస్తామన్నారు. సీనియర్ జర్నలిస్ట్ వి.వి.రమణమూర్తి, సత్గీత్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు గణేష్, హాస్యప్రియ కామెడీ క్లబ్ సెక్రటరీ ఇమంది ఈశ్వరరావు, చిన్నారెడ్డి, మను పల్ల, చిత్ర దర్శకులు యాద కుమార్, డి.వి.త్రినాథ్, శంకరరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


కేఏ పాల్‌తోనే అభివృద్ధి



కేఏ పాల్ సమక్షంలో పార్టీలో చేరిన కార్యకర్తలు

తాటిచెట్లపాలెం: అభివృద్ధి కావాలంటే, స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆగాలంటే, నిరుద్యోగ సమస్య తీరాలంటే ప్రజాశాంతి పార్టీ నుంచి విశాఖపట్నం ఎంపీగా పోటీ చేస్తున్న కేఏ పాల్‌ను గెలిపించుకోవాలని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జిలుకర రవికుమార్ అన్నారు. రైల్వే న్యూకాలనీలోని ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో ఆదివారం గాజువాక నియోజకవర్గం నుంచి పలువురు కార్యకర్తలు పార్టీలో చేరారు. కేఏ పాల్ వీరిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. దేశాన్ని సంరక్షించే సత్తా తనకు మాత్రమే ఉందన్నారు. ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలకు, 25 ఎంపీ స్థానాలకు తమ పార్టీ అభ్యర్థులు పోటీ పడుతున్నారన్నారు. త్వరలోనే అభ్యర్థులందరి ఎంపిక పూర్తిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ కో ఆర్డినేటర్ బాబోజీరావు, ఎం.ఝాన్సీ, విశాఖ పార్లమెంట్ స్థానంలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం కండి



42వ వార్డు ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ముందుగా సాగాలని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని శివాలయం పక్కన ఆదివారం వార్డు ఎన్నికల కార్యాలయాన్ని కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం వార్డు ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించి, ఎన్నికలకు సంబంధించి పలు సూచనలిచ్చారు. బూత్ స్థాయి, నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజా సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ ప్రజలతో నిత్యం మమేకం కావాలని కె.కె.రాజు సూచించారు. కార్యక్రమంలో వీకేపీసీఐఆర్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, పార్టీ వార్డు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



దైవ సందేశమిస్తున్న సిస్టర్ షైలాపాల్

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో పి.జె.స్టీఫెన్‌పాల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మినిస్ట్రీస్ నుంచి సిస్టర్ షైలాపాల్ ఈస్టర్ సందేశాన్ని వినిపించారు. ఆమె మాట్లాడుతూ ఏసుక్రీస్తు మానవాళిని రక్షించడం కోసమే మానవుడిగా జన్మించి, సిలువలో మరణించి, మూడో దినాన తిరిగి లేచాడని, ఈ సందర్భంగా ప్రపంచమంతా ఈస్టర్‌ను వేడుకలా జరుపుకుంటోందని తెలిపారు. వేడుకల్లో భాగంగా మృదుమధురమైన సంగీతం, ఆకర్షించే కొరియోగ్రఫీలను ప్రదర్శించారు. కార్యక్రమంలో నగర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నట్లు స్టీఫెన్‌పాల్ మినిస్ట్రీస్ ప్రతినిధులు తెలిపారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



శ్రీనివాస్‌నగర్ చర్చిలో మాట్లాడుతున్న కె.కె.రాజు



శాంతినగర్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న కె.కె.రాజు, కటుమూరి సతీష్

కంచరపాలెం: ఈస్టర్ పర్వదినం సందర్భంగా ఆదివారం 46వ వార్డు శాంతినగర్ చర్చి, 48వ వార్డు శ్రీనివాస్‌నగర్ చర్చిలను వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సందర్శించి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. చర్చిల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిస్వార్థంగా పనిచేస్తున్నారన్నారు. సంక్షేమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీని విజయం వైపు నడిపించాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, జేసీఎస్ కన్వీనర్లు నీలి రవి, వి.అప్పారావు, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, గోవింద్, చిన్న, చర్చి పాస్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

మురళీనగర్: నీటిని ఎక్కువగా తాగడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని యూరాలజిస్ట్ డాక్టర్ జి.శాంతివర్ధన్ అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మూత్ర సంబంధ వ్యాధుల నివారణ మార్గాలపై స్థానికులకు పలు సూచనలిచ్చారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎ.రమేష్‌బాబు మాట్లాడుతూ కాళ్లు, చేతులు తిమ్మిర్లు సమస్యలు ఉన్నవారు తేలికైన వ్యాయామం, నడక, మంచి ఆహార నియమాలు పాటించాలన్నారు. సాధారణ వ్యాధుల డాక్టర్ ఎం.మౌనిష ఎండాకాలంలో వడగాల్పుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వైద్య శిబిరంలో 214 మందికి పరీక్షలు చేశారు. 142 మంది ఈసీజీ గుండె పరీక్షలు, 136 మంది కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, ఉపాధ్యక్షులు ఎ.వి.సుబ్బారావు, మళ్ల రామకృష్ణ, కోశాధికారి జె.కూర్మారావు, సంయుక్త కార్యదర్శి ప్రసాదరావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, పూర్వాధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, చిలకపాటి కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులు సహకరించారు.